వివేకానందుడి జీవితం ఆదర్శం


మహాముత్తారం: వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మహాముత్తారం: స్వామి వివేకానంద జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ సుభద్ర అన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం అధికారులు, ప్రజాప్రతినిధులు వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. దేశ గౌరవ ప్రతిష్టతను ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పిన వ్యక్తి వివేకానంద అని అన్నారు. కడు పేద కుటుంబంలో పుట్టి తెలివి తేటలతో ప్రపంచ వ్యాప్తంగా యువతకు మార్గదర్శకుడు అయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శారద, ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, నీతిఅయోగ్ జిల్లా టీం లీడర్ సారాకౌశల్, ఏఓ సతీష్ పాల్గొన్నారు.

మల్హర్: మండలంలో తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందుని చిత్రపటానికి ఆధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యువత ఆశయాన్ని ముందుకు పెట్టుకొని జీవించాలని యువతకు చక్కని సందేశాన్ని ఇచ్చాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రవీందర్, ఆధ్యాపకులు నరేందర్, వెంకట్‌రెడ్డి, కరుణాకర్, స్వరూపరాణి, నరేష్, రమేష్, రవి, జైపాల్, ఉమామహేశ్వరి, కళాశాల సిబ్బంది, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాటారం: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. వివేకానంద పాఠశాల ఆవరణలోని స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వలుస వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వివేకానందుడి జీవితం యువకులకు ఆదర్శనీయం, ఆయన బోధనలు అనుసరనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు చీమల రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహదేవపూర్: మండల కేంద్రంలో వివేకానందుడి జయంతి వేడుకలు నెహ్రూ యూత్ క్లబ్ అధ్యక్షుడు అన్కారి ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో వివేకానంద జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ అరుణ, ఎంపీటీసీ సుధాకర్, సర్పంచ్ శ్రీపతిబాపు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య, నాయకులు వామన్ రావు, గట్టయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.


మల్హర్‌లో..


కాటారంలో..


మహదేవపూర్‌లో..

అధికారులపై చర్య తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీపీ సతీష్‌కుమార్

వెంకటాపురం(కె): మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్య తీసుకోవాలని పాలక మండలి సభ్యులు పట్టుబట్టారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చెరుకూరి సతీష్ కుమార్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలకు తీర్మానం చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. మండలంలోని రైతుల వేదికల్లో రైతులకు పంటల సాగు, సస్యరక్షణ చర్యలుపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన సదస్సులను నిర్వహించాలని జెడ్పీటీసీ పాయం రమణ అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉడటం లేదని ఇప్పటికైనా రైతులకు అందుబాటులో ఉండాలని అన్నారు. మండలంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలు, పైప్‌లైన్ మరమ్మతులను చేయటం లేదని దీంతో గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలో 66 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని త్వరలోనే వాటిని భర్తీ చేస్తామని సీడీపీఓ శిరీష తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో ఆరు అంగన్‌వాడీ సెంటర్‌లకు పక్క భవనాలు లేక పోవటంతో అద్దెకు సైతం రూమ్‌లు దొరకటం లేదని భవనాల నిర్మాణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అడ్డూరి బాబు, మండల వ్యవసాయ అధికారి గుంటక నర్సింహారావు ఉన్నారు.

బాబోయ్ కుక్కలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఎర్రి కుక్కలు సంచరిస్తున్నాయి. గ్రామంతోపాటు కాళేశ్వరం దేవస్థానం, బస్టాండ్, గోదావరి తీరం, మద్యం దుకాణాలు, చికెన్ సెంటర్లు, ఎస్టీ కాలనీ వద్ద అధిక సంఖ్యలో సంచరిస్తున్నాయి. ఎర్రి లేచిన కుక్కలు ఒంటరిగా కనిపించిన వారిపై దాడికి దిగుతున్నాయి. కాళేశ్వరం పుణ్యక్షేత్రం కావడంతో రాత్రి వేళల్లో భక్తులపై కూడా దాడులకు పాల్పడ్డ ఘటనలు ఉన్నాయి. రెండు రోజుల కిందట షేక్ మహబూబ్ అనే వ్యక్తిని చేతి వేళ్లు, తొడ భాగంలో కరిచి గాయపరిచింది. తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే కుటుంబ సభ్యులు మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం తరలించి వైద్యపరీక్షలు చేయించారు. ఇలా గ్రామంలో సంచరిస్తు చిన్నారులు, మహిళలు, వృద్ధులపై దాడికి దిగి గాయపరుస్తున్నాయి.

భయం భయంగా..

అసలే సంక్రాంతి సెలువులు కావడంతో పిల్లలు ఆటలు ఆడేందుకు వెళ్లడానికి జంకుతున్నారు. సాయంత్రం ఆరు దాటితే బయటికి రావడం లేదు. చిన్నపెద్ద తేడా లేకుండా రాత్రి పూట భయం భయంగా బయటకు వస్తున్నారు. సుమారుగా గ్రామంలో 300లకుపైగా కుక్కలు ఉండగా, ఎర్రిలేచిన కుక్కలు పదుల సంఖ్యలో ఉన్నట్లు తెలిసింది. పంచాయతీ అధికారులు స్పందించి ఎర్రిలేచిన కుక్కలను గుర్తించి నివారణ చర్యలు చేట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సుంగధ ద్రవ్యాల సాగుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న విజిస్నా

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో స్పైసెస్ బోర్డు ఆధ్వర్యంలో సుంగధ ద్రవ్యాల సాగుపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్పైసెస్ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ విజిస్నా, వ్యవసాయ రిటైర్డ్ శాస్త్రవేత్త ఉపేందర్‌రెడ్డి మాట్లాడారు. మిర్చి, పసుపు, మొక్కజొన్నతో పాటు సుంగధ ద్రవ్యాల పంటలు సైతం రైతులు పండించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలతో వ్యవసాయ, హార్టికల్చర్ అధికారుల సూచనల మేరకు పంటలను సాగు చేయాలని వివరించారు. నాణ్యమైన ప్రమాణాలతో పండించిన సుంగధ ద్రవ్యాల పంటల ఉత్పత్తులకు ఇతర దేశాల్లో మంచి డిమాండ్ ఉందని వెల్లడించారు. పంటల సాగులో రసాయన ఎరవులు తగ్గించి, సేంద్రియ ఎరవులు వాడకం పెంచాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, సర్పంచ్ సుంకరి సత్తయ్య, రైతులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

మహదేవపూర్: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మత్తు పదార్థాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వాడకంతో జీవితాలు చిన్న భిన్నమవుతాయన్నారు. ఎవరైనా గంజాయి అమ్మినట్లు తెలిసినచో సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య, ఎస్సై రాజ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

తెలంగాణ సచివాలయం సందర్శన


తెలంగాణ సచివాలయం వద్ద విద్యార్థులు

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజ్ఞాన విహారయాత్రలో భాగంగా తెలంగాణ నూతన సచివాలయం, అసెంబ్లీ భవనాలను సందర్శించారు. మండల కేంద్రంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమానికి హాజరైన మంత్రి సీతక్కను విద్యార్థులు కలిసి తెలంగాణ సచివాలయాన్ని చూసేందుకు అవకాశం కల్పించాలని అడగడంతో సీతక్క అంగీకరించారు. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధిక ఆధ్వర్యంలో 60 మంది విద్యార్థులు సచివాలయాన్ని, అసెంబ్లీని సందర్శించి ఆనందం వ్యక్తం చేశారు. అవకాశం కల్పించిన మంత్రి సీతక్కకు పాఠశాల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ చీకూర్తి రమేష్, ఉపాధ్యాయులు జనగాం బాబురావు, సాంబయ్య, మహేష్, శ్రీనివాస్, జ్యోత్స్న, నాగేందర్ పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు బానిసకావొద్దు

ములుగు: నేటి సమాజంలో యువత వ్యసనాలకు బానిసకావొద్దని సీఐ రంజిత్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత అంబేడ్కర్ జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. అనంతరం బొజ్జ తారక ట్రస్టు వరంగల్ జిల్లా కార్యదర్శి జన్ను సాంబయ్య అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేయటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతి గౌడ్, బోడ రములు, కుర్రి దినకర్, మహమ్మద్ పాషా, కాకి రవిపాల్ ఉన్నారు.

కరెంటు కంచెలతో ప్రమాదం


మాట్లాడుతున్న సీఐ బండారి కుమార్

వెంకటాపురం(కె): పంట పొలాల చుట్టూ కరెంట్ కంచెలతో ప్రమాదమని, కరెంటుతో కూడిన ఫెన్సింగ్‌ను వేయొద్దని వెంకటాపురం సీఐ బండారి కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండల పరిధిలోని సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ పంట పొలాలకు అడవి జంతువుల నుంచి రక్షణ కోసం కరెంట్‌తో కూడిన ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. దీంతో ఎవరైనా రైతులు రాత్రి వేళల్లో పొలాల వద్దకు వెళ్లే సమయంలో ఫెన్సింగ్‌కు తగిలి షాక్‌కు గురైయ్యే ప్రమాదం ఉందని అన్నారు. కరెంటుతో కూడిన ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ విషయాన్ని గ్రామాల్లోని రైతులకు తెలియజేయాలని సర్పంచ్‌లకు కోరారు. అలాగే గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుకు సహకరించాలన్నారు. గ్రామాల్లో కోడి పందేలు, గుడుంబా తయారీ, పేకాట, గంజాయి వినియోగం, అమ్మకాల గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో వెంకటాపురం ఎస్సై అశోక్ తదితరులు ఉన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ


ఏటూరునాగారం: రామాలయంలో అక్షింతలతో బయల్దేరిన రామసేవకులు


రేగొండ: నగర సంకీర్తన చేస్తున్న శ్రీరామ భక్తులు

ఏటూరునాగారం: ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలను పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు మోడెం రమేష్, కత్తెర శ్రీనివాస్, దీనబంధుస్వామి, వీరన్న, దామెర సమ్మయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని 16 వార్డుల వారీగా ఇంటింకి రామసేవకులు ప్రత్యేక దుస్తులను ధరించి అక్షింతలు, అయోధ్య రాముడి దేవాలయం ఫొటోలు, హనుమాన్ జెండాలను అందజేశారు. ముందుగా రామాలయంలో ప్రత్యేక కలశాలలో అక్షింతలను ఏర్పాటు చేసి శ్రీరాముడి పాదల వద్ద పెట్టి అర్చకులు యల్లప్రగడ నాగేశ్వర్‌రావుశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు యల్లప్రగడ సూర్యనారాయణశర్మ, రాధాకృష్ణశర్మ, సుదర్శనస్వామిలు రామసేవకులతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి అక్షింతల పంపిణీ చేపట్టారు. అలువాల శ్రీనివాస్, రంజిత్, సురేష్, కాళ్ల రామకృష్ణ, కాతా యాదగిరి, బోట రమణ, చెన్న రాంబాబు, లోటపెటల రాజేష్, బ్రహ్మం, సదానందం, రాము, మహేష్, రాజు, ప్రతాప్, నర్సింహరావు, ప్రశాంత్, తిరుపతి, సురేష్ పాల్గొన్నారు.

ఏఎస్పీకి అందజేత


ఏఎస్పీ సంకీర్త్‌కు అందజేస్తున్న అర్చకులు


కన్నాయిగూడెంలో..

అయోధరామయ్య అక్షింతలను అర్చకులు సూర్యనారాయణశర్మ ఏఎస్పీ సంకీర్త్‌కు అందజేశారు. అలాగే ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్‌కు అందజేశారు. అక్షింతల పంపిణీ కార్యక్రమంపై వారికి వివరించారు.

కన్నాయిగూడెం: మండలంలోని గూర్రేవులలో అయోధ్య నుంచి వచ్చిన రాముడి అక్షింతలను గ్రామస్తులు శుక్రవారం గ్రామానికి తీసుకువచ్చారు. భక్తి శ్రద్ధలతో డోలీలు, భజన పాటలు పాడుతూ గ్రామానికి తీసుకొచ్చి గ్రామంలో వాడ వాడకు ఊరేగింపు చేశారు. అనంతరం గ్రామంలోని రామ మందిరంలో ఉంచి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జనగం సమ్మక్క, సర్పంచ్ కావిరి పద్మ ఉన్నారు.

రేగొండ: మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన రాములోరి పూజిత అక్షింతలు శుక్రవారం రేగొండ, గడిపల్లి, రావులపల్లి గ్రామాల్లో శ్రీరామ భక్తులు నగర సంకీర్తనతో ఇంటింటికీ పంపిణీ చేశారు. అంతకుముందు అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రేగొండ సర్పంచ్ ఏడునూతుల నిశీధర్ రెడ్డి, ఉప సర్పంచ్ గండి తిరుపతి, సామల సురేందర్‌రెడ్డి, ఏనుగు లింగారెడ్డి, అశోక్ రెడ్డి, తూర్పాటి మల్లేష్,పెండ్యాల రాజు, సురేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

భూపాలపల్లి రూరల్: పతంగులు ఎగురవేసే సమయంలో పిల్లలు, తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని భూపాలపల్లి టీఎస్ ఎన్పీడీసీఎల్ డివి జనల్ ఇంజనీర్ నాగారాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగులు ఎగురవేసేటప్పుడు చిన్నారులు జాగ్రత్త వహించాలని సూచించారు. విద్యుత్ సెల్ ఫోన్ టవర్లు ఉన్న చోట గాలి పటాలు ఎగురవేయకూడదని తెలిపారు. ఆరు బయట కాలి ప్రదేశాల్లో, మైదానాలలో మాత్రమే ఎగురవేయాలన్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు.

వన్యప్రాణులను వేటాడితే చర్యలు

వెంకటాపురం(ఎం): వన్యప్రాణులను వేటాడి తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై చల్లా రాజు అన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ.. అటవీ జంతువుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అటవీ జంతువుల కోసం కొంతమంది సమీప అడవుల్లో ఉచ్చులు పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. విద్యుత్ తీగలతో ఉచ్చులు పెట్టడం వల్ల ప్రమాదాలు జరిగి అమాయక ప్రజలు సైతం ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. వేటగాళ్లు తమ పద్ధతి మార్చుకోకపోతే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమన్వయంతో పనిచేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ విజయ

ఏటూరునాగారం: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ అంతటి విజయ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ అధికారి వేణు తమ శాఖ ద్వారా చేపడుతున్న పనులను వివరించారు. రైతులు ఏ పంట సాగు చేస్తున్నారని సర్వే చేపట్టామన్నారు. అలాగే రొయ్యూర్ పీహెచ్‌సీ కింద 21456 మంది జనాభా ఉందని, వారిలో వ్యాధికి గురైన వారికి డెంగీ, టైఫాయిడ్‌ను పరీక్షలు చేసి వైద్య చికిత్సలు అందజేసినట్లు వైద్యాధికారి సుమలత తెలిపారు. మహిళలకు స్కానింగ్ చేస్తున్నారా వారికి ఎలాంటి చికిత్సలు ఇస్తున్నారని జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ ప్రశ్నించారు. టీఐఎఫ్ఏ స్కానింగ్‌లు చేస్తున్న వైద్యురాలు తెలిపారు. ఏటూరునాగారం స్మశాన వాటికి విద్యుత్ సరఫరా అందించాలని స్థానిక సర్పంచ్ ఈసం రామ్మూర్తి ఏఈ అశోక్‌కు కోరారు. దానికి సంబంధించిన నగదును గ్రామ పంచాయతీ ద్వారా చెల్లిస్తే తాము విద్యుత్ లైన్‌లను వేస్తామని ఏఈ తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ మెంటనెన్స్ సరిగా లేదని, తరుచూ కరెంటు పోతుందని పాలక మండలి సభ్యులు ప్రశ్నించారు. ప్రస్తుతం ఎలిశెట్టిపల్లి, రామన్నగూడెం ప్రాంతాల్లో మరమ్మతులు జరుగుతున్నాయని, సబ్ స్టేషన్ పనులు కూడా అవుతున్నాయని ఏఈ తెలిపారు. పంచాయతీరాజ్ కింద మంజూరు అయిన సీసీ రోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పీఆర్ ఏఈఈ భిక్షపతి తెలిపారు. అదేవిధంగా మిషన్ భగీరథ కింద ఉన్న పైపులైన్ల లీకేజీలు ఉన్నాయని, కొన్ని చోట్ల రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చలేదని పాలకసభ్యులు ప్రశ్నించగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్ వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఎంపీడీఓ కుమార్ మాట్లాడుతూ సభ్యులు చెప్పిన సమస్యలను అధికారుల ద్వారా పరిష్కరించే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డి, ఎంపీటీసీలు లక్ష్మీనారాయణ, గుడ్ల శ్రీలత, అల్లి సుమలత, కుమ్మరి స్వప్న, మండల కోఆప్షన్ సభ్యుడు ఖలీల్, అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రమణ

వెంకటాపురం(కె): క్రీడలతో మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని జెడ్పీటీసీ పాయం రమణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పాత్రాపురం గ్రామంలో డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో క్రీడల్లో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్, సర్పంచ్ కృష్ణార్జునరావు, గడ్డం వివేక్ తదిదరులు ఉన్నారు.

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



ఎస్ఎస్‌తాడ్వాయి: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొక్కెర రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మేడారంలో అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం 2024 క్యాలెండర్‌ను ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, విద్యాభివృద్ధికి సంఘం పాటుపడుతుందన్నారు. నూతన ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జబ్బ రవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎట్టి సారయ్య, తాడ్వాయి మండల అధ్యక్షుడు ఊకే పున్నం చందర్, రాష్ట్ర కార్యదర్శి అంజయ్య, సంఘ సభ్యులు రేగ కిరణ్ కుమార్, కోమటిపల్లి హెచ్ఎం సారంగపాణి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



భూపాలపల్లి రూరల్: స్వయంకృషి మున్నూరు కాపు సంఘం సుభాష్ కాలనీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, స్వయంకృషి మున్నూరు సంఘం అధ్యక్షుడు బాస్కారి సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ కొత్రంగి నాగార్జున, ఉపాధ్యక్షుడు మేడ వెంకటస్వామి, అధికార ప్రతినిధి సుంకరి గోవర్ధన్, కోశాధికారి భాస్కరి సుధాకర్, సలహాదారులు, సత్యనారాయణ, రవి, భరత్, సుధాకర్, సాయికృష్ణ, బర్ల రవీందర్, బూర అనిల్, తోట శ్రీనివాస్, సూర బుచ్చయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎస్సీ మర్రిగూడెం గ్రామానికి చెందిన పలువురు జెడ్పీటీసీ పాయం రమణ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేశారు. పార్టీలో చేరిన వారిని కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పలు అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్, ఎంపీటీసీ గార్లపాటి రవి, తదితరులు ఉన్నారు.

మండల సర్వసభ్య సమావేశం



పలిమెల: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ కురుసం బుచ్చక్క అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అధికారులు పాల్గొని తమ నివేదికలను చదివి వినిపించారు. అనంతరం, సర్పంచులు జవ్వాజి పుష్పలత, తోట రమాదేవి, మడే చుక్కమ్మ, రేగ నరేష్, చిడం నాగయ్యను సన్మానించారు.

నేనే రాజు..నేనే మంత్రి!



కాళేశ్వరం: నా ప్రపంచానికి నేనే రాజు...నేనే మంత్రి. నాకు సరిలేరు ఎవరూ అనుకున్నట్టుంది ఈ పక్కన మతిస్థిమితం లేని వ్యక్తి ఫొటో. ఓ కుక్కతో చాలా బిందాస్‌గా కూర్చొని ఎలాంటి బాధలు, సంతోషాలు లేనట్టు కనిపిస్తుంది కదూ... మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం ప్రాంగణంలో కొన్ని సంవత్సరాలుగా మతి స్థిమితం లేక సంచరిస్తున్న వ్యక్తి ఇతను. పరిసర ప్రాంతంతో పాటు గ్రామంలో యాచిస్తు జీవితం గడుపుతున్నాడు. మతిస్థిమితం లేక చలి, వాన, ఎండ అనే తేడా లేకుండా ఆలయం పరిసరాల్లోనే గడిపేస్తున్నాడు. గతంలో ఇక్కడ మతి స్థిమితం లేక తిరుగుతున్న వారిని అప్పటి పోలీస్, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లాలోని ఆశ్రమానికి తరలించారు. కాగా, ఆలయ ప్రాంగణంలో అప్పటి నుంచి మతిస్థిమితం లేని వ్యక్తుల సంఖ్య చాలా తగ్గింది. శుక్రవారం సాయంత్రం కుక్కతో మతిస్థిమితం లేని వ్యక్తి కూర్చున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది.